కరీంనగర్‌లోని సప్తగిరికాలనీలో బడిబాట ర్యాలీ తీస్తున్న ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు

గంగాధర: ఒద్యారంలో..

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

- జిల్లా వ్యాప్తంగా బడిబాట కార్యక్రమం
- అవగాహన ర్యాలీలు చేపట్టిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

కమాన్‌చౌరస్తా/గంగాధర/చిగురుమామిడి/ఇల్లందకుంట/కరీంనగర్ రూరల్/చొప్పదండి, జూన్ 6: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఉదయం పాఠశాలల్లో ఈనెల 19 వరకు చేపట్టే కార్యక్రమాలు, కార్యాచరణపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా చర్చించారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని సప్తగిరికాలనీలో కార్పొరేటర్ బుచ్చిరెడ్డి, లయన్స్ క్లబ్, వాకర్స్ అసోసియేషన్, తదితర స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీ తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, విద్యా బోధన తీరును విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతి, గాజుల రవీందర్, తూముల తిరుపతి, ప్రసాద్, శ్రీనివాస్, స్వామి, సత్యనారాయణ రావు, రామారావు, అన్నపూర్ణ, ఉమా మల్లీశ్వరి, గీత, పద్మజ, అపోలినా, షబానా, భారతి,

చొప్పదండి: రామడుగు మండలం గోపాల్‌రావుపేటలో...

ప్రమీల, శంకరయ్య, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. గంగాధర మండలం ఒద్యారం, బూరుగుపల్లి గ్రామాల్లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఏనుగు ప్రభాకర్‌రావు, లక్ష్మణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. చిగురుమామిడి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ర్యాలీ తీశారు. బొమ్మనపల్లిలో ఎంఈవో కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శోభారాణి, లక్ష్మణరావు, కోలరాంచంద్రారెడ్డి, నర్సింహారెడ్డి, పావని, సత్యనారాయణ, బాల్‌రెడ్డి, ఎంపీటీసీ మిట్టపల్లి మల్లేశం, మాజీ సర్పంచ్ వెంకటేశం, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఇల్లందకుంట మండలంలో హెచ్ఎంలు సాంబయ్య, గోపీ, ఉపాధ్యాయులు జయప్రకాశ్, మల్లయ్య, అన్నపూర్ణ, శ్రీదేవి, సమ్మిరెడ్డి, శంకర్, మారుతి తదితరులు పాల్గొన్నారు. కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీనగర్, చామనపల్లి, చెర్లభూత్కూర్, దుర్శేడ్, నగునూర్ గ్రామాల్లో ఎంపీడీవో సంజీవరావు, ప్రధానోపాధ్యాయులు జలజారాణి, రామస్వామి, భారతి, చెర్లభూత్కూర్ ఎంపీటీసీ బుర్ర తిరుపతి గౌడ్, మాజీ సర్పంచులు దబ్బెట రమణారెడ్డి, రుద్ర భారతి, రుద్ర రాములు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు. రామడుగు మండలం గోపాల్‌రావుపేట,రంగసాయిపల్లె గ్రామాల్లో ఎంఈవో అంబటి వేణుకుమార్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు చేపట్టారు.

చిగురుమామిడి: గాగిరెడ్డిపల్లిలో..

ఇల్లందకుంట: మండల కేంద్రంలో..

కరీంనగర్‌రూరల్: చెర్లభూత్కూర్‌లో..

వేదికపై చిన్నారులతో బాలభవన్ సిబ్బంది

ముగిసిన బాలభవన్ వేసవి శిబిరం

- అట్టహాసంగా వేడుకలు
- సందడిగా కలెక్టరేట్ ఆడిటోరియం

వేడుకలకు హాజరైన చిన్నారులు, తల్లిదండ్రులు

కమాన్‌చౌరస్తా, జూన్ 6: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో బాలభవన్ ఆధ్వర్యంలో సుమారు 45 రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమాన్ని గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో అట్టహాసంగా నిర్వహించారు. ముగింపు కార్యక్రమాన్ని బాలభవన్ నిర్వాహకురాలు కే మంజులాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముగింపు కార్యక్రమంలో డ్యాన్స్, క్లాసికల్ డ్యాన్స్, సంగీతం, మృదంగం, డ్రాయింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, యోగా, అబాకస్ ప్రదర్శనలు ఇచ్చారు. అలాగే, విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించగా, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. చిన్నారులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కలెక్టర్ ఆడిటోరియం సందడిగా మారింది. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

సందేహాలు నివృత్తి చేశారు

నేను వేసవి శిబిరంలో డ్యాన్స్ నేర్చుకున్నా. సారు ప్రతి రోజూ చిన్న చిన్న స్టెప్పులను నేర్పించారు. సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేశారు. ఇంట్లో కూడా డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తున్నా. ప్రతి సంవత్సరం డ్యాన్స్ నేర్చుకుంటా.
- జీ నైనిక, మూడో తరగతి, కరీంనగర్

డ్యాన్స్ అంటే చాలా ఇష్టం

నాకు డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. బాలభవన్‌లో శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యం నేర్చుకున్నా. ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడం ద్వారానే అన్ని నేర్చుకోగలిగాం. ఆఖరు రోజు అందరి ముందు ప్రత్యేకంగా ప్రదర్శన ఇప్పించడం సంతోషంగా ఉంది.
- స్నేహిత, హనుమాన్‌నగర్

ప్రత్యేకంగా అభినందించారు

ముగింపు వేడుకల్లో తాను వేంకటేశ్వరస్వామి అవతారంలో ప్రదర్శన ఇచ్చాను. ఇది అందరినీ ఆకట్టుకుంది. అందరూ నన్ను ప్రత్యేకంగా అభినందించారు. నేను ఐదేళ్లుగా నృత్యం నేర్చుకుంటున్నా. ప్రతి వేసవిలో శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుంటున్నా.
- డీ శివాణిక, 8వ తరగతి

సంతోషంగా ఉంది

నేను హైదరాబాద్‌లో చదువుకుంటున్నా. వేసవి సెలవుల కోసం కరీంనగర్‌కు వచ్చాను. ఇక్కడ బాలభవన్‌లో వేసవిలో డ్యాన్స్, అబాకస్ నేర్చుకున్నా. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడం సంతోషంగా ఉంది. ప్రతి వేసవిలో ఒక్కో అంశంలో శిక్షణ పొందుతున్నా.
- ఆరాధ్య, భగత్‌నగర్, ఏడో తరగతి

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

శంకరపట్నం, జూన్ 6: కేశవపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. కాగా, క్రీడాకారులకు గ్రామానికి చెందిన తనుకు మూర్తి, తనుకు శ్రీనివాస్, తనుకు చంద్రప్రకాశ్ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. దాతలకు క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టరేట్, జూన్ 6: గ్రూప్-1 ప్రిలిమినరీ పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే శాంతికుమారి సూచించారు. గురువారం రాత్రి ఆమె టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి, డీజీపీ రవి గుప్తాతో కలిసి గ్రూప్-1 ప్రిలిమినరీ ఏర్పాట్లు, విత్తనాలు, ఎరువుల సరఫరా, మిషన్ భగీరథ పథకం అమలు, స్కూల్ యూనిఫామ్ తయారీపై ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే శాంతికుమారి మాట్లాడుతూ, గ్రూప్-1 ప్రిలిమినరీకి పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఓఎంఆర్ షీట్లు, ప్రశ్న పత్రాలు ఆయా జిల్లా కేంద్రాల్లో స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచాలని ఆదేశించారు. ఈనెల 9న ఉదయం ఐదు గంటలకల్లా ఆయా పరీక్షా కేంద్రాలకు ఓఎంఆర్ షీట్లు,

వీసీకి హాజరైన కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్

ప్రశ్న పత్రాలు పోలీస్ ఎస్కార్ట్ మధ్య తరలించాలని పేర్కొన్నారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీస్ అధికారులు పరీక్ష జరిగే ముందు రోజు పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సీజన్‌లో రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలన్నారు. నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా టాస్క్‌ఫోర్స్ బృందాలతో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ పథకం అమలు తీరు తెన్నులపై ఇంటింటా సర్వే చేపట్టాలని సూచించారు. ఈనెల 12 నుంచి ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అంతకుముందే స్కూల్ యూనిఫామ్స్ పూర్తిస్థాయిలో తయారు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. ఎన్నికల కోడ్ ముగిసినందున సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులను శుక్రవారం నుంచి వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, డీఆర్వో పవన్ కుమార్, డీఏవో శ్రీనివాస్, డీఈవో జనార్దన్ రావు, డీపీవో రవీందర్, డీఆర్డీవో శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

హుజూరాబాద్ రూరల్, జూన్ 6: డివిజన్ పరిధిలోని భవన నిర్మాణ కార్మికులు లేబర్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని హుజూరాబాద్ సహాయ కార్మిక అధికారి చందన ఒక ప్రకటనలో తెలిపారు. హుజూరాబాద్‌లోని సహాయ కార్మిక శాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు ఇచ్చి రిజిస్టర్‌లో సంతకం చేయాలని సూచించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

వీణవంక, జూన్ 6: మండలంలోని రెడ్డిపల్లి, హిమ్మత్‌నగర్, కిష్టంపేట గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం డీఈవో జనార్దన్‌రావు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో విడపు శ్రీనివాస్, ఘన్ముక్ల, చల్లూరు కాంప్లెక్స్ హెచ్ఎంలు శ్రీనివాస్, సంపత్‌కుమార్‌చారి, అసిస్టెంట్ ఇంజినీర్ రమేశ్, హెచ్ఎంలు సీహెచ్ శ్రీనివాస్, రాజగోపాల్‌రెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

పిడుగు పాటుకు బర్రె మృతి

వీణవంక, జూన్ 6: మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో కట్ట ఈశ్వరమ్మకు చెందిన బర్రె గురువారం సాయంత్రం పిడుగు పడి మృతిచెందింది. బర్రె విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరారు.

రైతు సంఘాల ఐక్య వేదిక సమావేశం

కలెక్టరేట్, జూన్ 6: మంకమ్మతోటలోని తెలంగాణ రైతు సంఘాల ఐక్య వేదిక జిల్లా కార్యాలయంలో గురువారం ఉమ్మడి జిల్లా పాలకవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరెడ్డి, సంపత్‌రావు మాట్లాడారు. రైతు సంఘాల ఐక్య వేదిక నాయకులు రాజయ్య, రామస్వామి, రమణయ్య, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

బడిబాట కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు

మానకొండూర్, జూన్ 6: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని డీఈవో జనార్దన్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో గురువారం నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం ఎమ్మార్సీలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు. ఎంఈవో మధుసూదనాచారి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
PLOT FOR SALE
★Karimnagar-Hyd Highway Road, R.K.Colony Residential & Commercial 6 Guntas Plots are available. Contact on: 7780646886.
NT-327730

చికిత్స పొందుతూ యువకుడి మృతి

శంకరపట్నం, జూన్ 6: మండలంలోని కన్నాపూర్ గ్రామంలో ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాపూర్ గ్రామానికి చెందిన ఐలు కుమార్ (24) ఇంటర్ చదివి తండ్రికి పొలం పనుల్లో చేదోడువాదోడుగా ఉంటున్నాడు. రెండేళ్లుగా కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించినా నయం కాలేదు. ఈ క్రమంలో ఈనెల 2న ఉదయం పొలం వద్ద ఐలు కుమార్ పురుగుల మందు తాగి, విషయం తండ్రికి ఫోన్ చేసి చెప్పాడు. కుటుంబసభ్యులు వెంటనే జమ్మికుంట దవాఖానకు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హన్మకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. ఐలు కుమార్ తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

కాల్వ నర్సయ్య యాదవ్‌కు నివాళి

కరీంనగర్ రూరల్/తెలంగాణచౌక్, జూన్ 6: బొమ్మకల్‌లోని లక్ష్మీనగర్ యాదవ, గొర్రెల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం కామ్రేడ్ కాల్వ నర్సయ్య యాదవ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆటోనగర్‌లోని కాల్వ నర్సయ్య యాదవ్ విగ్రహానికి యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు నగర సత్యనారాయణ యాదవ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కాల్వ మల్లేశం యాదవ్, రవియాదవ్, సంఘం నాయకులు పూల మాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో యాదవ సంఘం యూత్ జిల్లా అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్ యాదవ్, మాజీ వార్డు సభ్యులు కాల్వ అశోక్‌యాదవ్, కాల్వ రాజు యాదవ్, రాజ్‌కుమార్ యాదవ్, రవి, రాజన్న, సిరిసిల్ల జిల్లా యువజన సంఘాల అధ్యక్షుడు భూమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

మానకొండూర్, జూన్ 6: ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ఉపాధి హామీ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. మానకొండూర్‌లో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు గురువారం ఆయన వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ, ఈ సదస్సుకు ఉపాధి కూలీలు, మేట్లు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్, కూలీలు

ఈసెట్‌లో 'జ్యోతిష్మతి' విద్యార్థుల సత్తా

విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు

తిమ్మాపూర్ రూరల్, జూన్ 6: మండల కేంద్రంలోని జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్)లో డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులు ఈసెట్‌లో సత్తా చాటారు. జే సాయికిరణ్ ఈసీఈ విభాగంలో 87వ ర్యాంక్, డీ గోపి సీఎస్ఈలో 125, ఏ నిషీద సీఎస్ఈలో 178, ఎస్ మౌర్య ట్రిపుల్ ఈలో 185వ ర్యాంక్ సాధించారు. సాయి కిరణ్‌కు రూ.50 వేలు, మిగతా వారికి రూ.20 వేల చొప్పున చెక్కులను కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు మాట్లాడుతూ, విద్యార్థులు భవిష్యత్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, మంచి కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు సాధించి, కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ రావు, అకాడమిక్ అండ్ ఆడిట్ డీన్ డాక్టర్ పీకే వైశాలి, సృజన్‌రావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

CHANGE OF NAME
I CH LATHA W/o ARMY No: 15331620H, Rank: HAV Name: Cherala Chiranjeevi, R/o. H.No. 7-31, Vill: Mallannapalli, Post: Rachapalle, Mandal: Ellandakunta, Dist: Karimnagar, State: Telangana, Pin: 505475, have changed my name from CH LATHA to CHERALA LATHA vide Affidavit sworn Before M SADAIAH Notaty, Jammikunta date: 1-6-2024.

ఎంపీని కలిసిన యాదవ సంఘం నాయకులు

తెలంగాణచౌక్, జూన్ 6: జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బండి మల్లయ్య యాదవ్, కరీంనగర్ వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు సంపత్, శివ, తిరుపతి, సాయిలు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

11న ఆలయ భూముల కౌలుకు వేలం

శంకరపట్నం, జూన్ 6: కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయ భూములను కౌలు ఇచ్చేందుకు ఈ నెల 11న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈవో సుధాకర్ తెలిపారు. సర్వే నంబర్ 407లో 38 గుంటల భూమి ఉందని, ఆసక్తి గల వారు రూ.10 వేలు చెల్లించి, వేలంలో పాల్గొనాలని సూచించారు.

పొంచి ఉన్న ప్రమాదం

గంగాధర మండలం సర్వారెడ్డిపల్లి గ్రామంలోని పొలాల్లో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రమాదకరంగా వేలాడుతున్న తీగలను సరి చేయాలని రైతులు కోరుతున్నారు.
-గంగాధర, జూన్ 6

కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను చూపుతున్న రైతు

'కౌశిక్‌రెడ్డిని విమర్శించే స్థాయి కృష్ణారెడ్డికి లేదు'

హుజూరాబాద్, జూన్ 6: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని విమర్శించే స్థాయి పత్తి కృష్ణారెడ్డికి లేదని జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోల్లేని సత్యనారాయణరావు పేర్కొన్నారు. పట్టణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యాపారులను బ్లాక్ మెయిల్ చేస్తూ జీవిస్తున్నావని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉందని కాంగ్రెస్‌కు, కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఓటు వేశారని గుర్తు చేశారు. అది ప్రణవ్ గొప్పతనం కాదని, మిగతా నియోజకవర్గాలతో పోలిస్తే హుజూరాబాద్‌లో బీఆర్ఎస్‌కు ఎక్కువ ఓట్లు వచ్చినట్లు చెప్పారు.

నర్సరీల యజమానులు లైసెన్స్ తీసుకోవాలి

నర్సరీ నిర్వాహకుడిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు

తిమ్మాపూర్, జూన్ 6: కూరగాయల మొక్కలు పెంచే నర్సరీల యజమానులు లైసెన్స్ తీసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి స్వాతి సూచించారు. మండలంలోని కూరగాయల మొక్కల నర్సరీలను గురువారం ఆమె వ్యవసాయాధికారి సురేందర్, ఎస్ఐ చేరాలుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా లైసెన్స్ లేని పలు నర్సరీలను గుర్తించి.. వారికి నాలుగు రోజులు గడువు ఇచ్చారు. లైసెన్స్ ఉన్న వారు ఏడాదికోసారి రెన్యూవల్ చేసుకోవాలని, నారు కొనుగోలు చేసే రైతులకు రసీదు ఇవ్వాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జూన్ 6: కొత్త ట్రాన్స్‌ఫార్మర్ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు అంబేద్కర్ స్టేడియం నుంచి గౌతమీ నగర్, అభయాంజనేయ స్వామి గుడి ఏరియా, కాకతీయ స్కూల్ ఏరియా, బృందావన్ ఫంక్షన్ హాల్ బ్యాక్ సైడ్, గంగపుత్ర వీధి, బ్రాహ్మణ వీధి, న్యూశ్రీనగర్ కాలనీ, గౌతమీనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-2ఏడీఈ సుధీర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీజేపీకి గుణపాఠం చెప్పిన ప్రజలు

తెలంగాణచౌక్, జూన్ 6: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి దేశ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం పేర్కొన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయం (ముకుందలాల్ మిశ్రా భవనం)లో గురువారం నిర్వహించిన పార్టీ నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేవుడి పేరుతో ఓట్లు దండుకోవాలని చూసిన బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం నగర కమిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

తెలంగాణచౌక్, జూన్ 6: అధిక ఫీజు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ పెంట అజయ్‌కుమార్ పటేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ విద్యార్థి నాయకులు వికాస్, కోటేశ్వర్, కిషన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

తిమ్మాపూర్, జూన్ 6: మండలంలోని మహాత్మానగర్ గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. మహాత్మానగర్‌కు చెందిన గురుకుల వెంకటరమణ(66) సింగరేణిలో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. అనంతరం మహాత్మానగర్‌లో ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 9 గంటల సమయంలో ఎల్ఎండీ గెస్ట్ హౌస్ వద్ద తన ఆటోలో మృతి చెంది ఉండగా, స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి వివరాలు సేకరించారు. వెంకటరమణ భార్య జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చేరాలు తెలిపారు.

క్రీడా సామగ్రి అందజేత

విద్యానగర్, జూన్ 6: నగరంలో మేము సైతం యువసేన ఫౌండేషన్ సభ్యుడు ప్రశాంత్ పుట్టిన రోజును పురస్కరించుకొని పేదలకు అన్నదానం, చిన్నారులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న, శ్రీనివాస్, రూప, అనురూప్ పాల్గొన్నారు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: